

చేప కథ






చేప కథ



“నాకు ఇక్కడి నుంచి బయటపడాలని ఉంది!"
చిన్నారి చేప అంది. “ఈ మడుగులో ఈది, ఈది నేను
అలసిపోయాను. ఒక పెద్ద చెరువులో ఈదాలని ఉంది.”
ఒడ్డు పక్కగా వెళుతున్న ఒక పిల్లి ఆ మాటలను విన్నది.

“నేను నీకు సహాయం చెయ్యనా?"
పెద్ద పిల్లి అడిగింది.
“నేను ప్రపంచాన్ని చూడాలని అనుకుంటున్నాను," చిన్నారి చేప అంది.
“ప్రపంచం చాలా అందమైనది, చూడటానికి ఎంతో బాగుంటుంది,” పెద్ద పిల్లి చెప్పింది. “పూలు... చెట్లు... సముద్రం... ఆ గుట్ట దాటితే అన్నీ కనపడతాయి."






“సముద్రం! పెద్ద చేప నాకు దాని గురించి చెప్పింది," చిన్నారి చేప అంది. “నన్ను అక్కడికి తీసుకుని వెళతావా?"

“తప్పకుండా," పెద్ద పిల్లి చెప్పింది. “అయితే, నిన్ను తీసుకుని వెళ్లటానికి ముందుగా ఇంటికి వెళ్లి ఒక సంచి తెస్తాను."

“తొందరగా వస్తావు కదూ," చిన్నారి చేప అడిగింది.


పెద్ద పిల్లి ఒక ప్లాస్టిక్ సంచితో తిరిగి వచ్చింది.
దానిని నీటిలో ముంచింది.
చిన్నారి చేప ఆ సంచిలోకి ఈదింది.
“నువ్వు చాలా మంచిదానివి," చిన్నారి చేప చెప్పింది. “ఏదో ఒక రోజు నీ రుణం తీర్చుకుంటాను."
“ఒక స్నేహితుడికి సహాయం చెయ్యగలుగుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది," పెదాలు నాకుతూ పెద్ద పిల్లి బదులిచ్చింది.



అడవి లోంచి పెద్ద పిల్లి పరిగెత్తసాగింది.
"ఎంత అందంగా ఉంది అది... అది పువ్వా?"
చిన్నారి చేప అడిగింది.
“అవును, అది పువ్వు," పెద్ద పిల్లి చెప్పింది.
“అదేమిటి, పక్షా?"
“అవును," పెద్ద పిల్లి గుర్రుమంది.
“ఇక్కడ కొంచెం సేపు ఆగుదామా?" చిన్నారి చేప అడిగింది.
“వద్దు," పెద్ద పిల్లి అరిచింది.
“సముద్రం ఎక్కడ ఉంది?" చిన్నారి చేప అడిగింది.
“ఈ గుట్ట దాటితే వస్తుంది," పెద్ద పిల్లి చెప్పింది. “కాసేపు గమ్మున ఉండు! చాలా ప్రశ్నలు అడుగుతున్నావు."
“నన్ను మన్నించు," చిన్నారి చేప చిన్నబోయింది.
“ఇదంతా నాకు కొత్తగా ఉంది."




గుట్ట మీదగా పెద్ద పిల్లి వేగంగా పరిగెత్తింది.
తరవాత ఒక ఇంటి లోపలికి వెళ్లింది.
“సముద్రం ఇక్కడ ఉందా?" చిన్నారి చేప అడిగింది.
“అవును, నీ ప్రయాణం ఇక్కడితో ముగిసింది,"
పెద్ద పిల్లి చెప్పింది.
చిన్నారి చేపకి అక్కడ చాలా గిన్నెలు కనపడ్డాయి.
గోడకి తగిలించిన ఒక మూకుడు దానికి కనిపించింది.
“ఈ ప్రదేశం... ఇది సముద్రమేనా?" అది అడిగింది.
“కాదు... ఇది నా వంట గది! పిచ్చి చేప," పెద్ద పిల్లి
అంది. “ఇప్పుడు నిన్ను కూర చెయ్యబోతున్నాను!"




చిన్నారి చేప భయంతో ఒణికిపోసాగింది.
“నన్ను ఎందుకు?" అది అడిగింది.
పెద్ద పిల్లి సంతోషంతో కూనిరాగం తీస్తోంది.
అది మూకుడులో నూనె వేసింది.
“పిల్లులూ – చేపలూ గురించి నీకు పెద్ద చేప ఏమీ చెప్పలేదా?” అది అడిగింది.
“నువ్వు, నువ్వు... పిల్లివా?" చిన్నారి చేప అడిగింది.
“అవును, నా పేరు పెద్ద పిల్లి. ఇప్పుడు నిన్ను తినబోతున్నాను... అయితే నీ మీద వ్యక్తిగతంగా నాకు ఎటువంటి పగ లేదు."



“కానీ నా వంటి నిండా ముళ్లు తప్ప ఏమీ లేదు,"
చిన్నారి చేప ఏడుస్తూ చెప్పింది.
“గోల చెయ్యకు! ఈ వంటల పుస్తకంలో కొత్త వంట రకం గురించి చదువుతున్నాను," పెద్ద పిల్లి కోప్పడింది. "ఊ! ఉడక బెట్టాలి... నూనెలో వేయించాలి... వెన్న పట్టించాలి...! పచ్చడితో వేయించిన చేప, చిప్స్, కెచప్‌తో తింటే బాగుంటుంది! నాకు ఆకలి దంచికొడుతోంది!"
“పెద్ద పిల్లీ, కొంచెం ఆగు!" చిన్నారి చేప మొత్తుకుంది.
“ఒక్కసారి నన్ను చూడు. నా బక్క శరీరంలో ముళ్లు మాత్రమే ఉన్నాయి. నేను నీ పంటి కిందకి కూడా చాలను!
కానీ నాకు ఒక పెద్ద చేప తెలుసు...
దానిని తెచ్చుకున్నావంటే నీ వంటిల్లు నిండి పోతుంది."






చిన్నారి చేపని పెద్ద పిల్లి చూసింది.
“ఆ పెద్ద చేప ఎక్కడుంది?" అది అడిగింది.
“మడుగులో. అది ఎంత పెద్దదంటే దానిని నువ్వు నెల రోజులపాటు తినవచ్చు," చిన్నారి చేప చెప్పింది.
“నన్ను తిరిగి మడుగు దగ్గరకు తీసుకుని వెళితే అతడిని నీ కోసం తెస్తాను."
“ఎలా తెస్తావు?" పెద్ద పిల్లి అడిగింది.
“నీ దగ్గర కెచప్ ఉందా?" చిన్నారి చేప అడిగింది.
“ఉంది, దాంతో ఏం చేస్తావు?" పెద్ద పిల్లి అడిగింది.
“కెచప్ అంటే పెద్ద చేపకి చాలా ఇష్టం."
“నిజమా?” పెద్ద పిల్లి ఆశ్చర్యపోయింది.
“నన్ను మళ్లీ మడుగు దగ్గరకు తీసుకుని వెళ్లు," చిన్నారి చేప చెప్పింది. “కొంచెం కెచప్, కొంత దారం తీసుకుని రా. మిగిలింది నాకు వదిలిపెట్టు."


ప్లాస్టిక్ సంచిలో చిన్నారి చేపని, మరో సంచిలో కెచప్‌ని పెద్ద పిల్లి తీసుకుంది.
మడుగువైపు అది వేగంగా పరిగెత్తసాగింది.



చిన్న చేపని పెద్ద పిల్లి మడుగులో వదిలిపెట్టింది. దారానికి
కెచప్ సంచి కట్టి నీటిలోకి వదిలిపెట్టింది.
సంచిలోంచి మడుగులోకి ఈదిన చేప,
“మడుగులోకి తిరిగి రావటంతో ఎంత హాయిగా ఉంది,"
అనుకుంది. తరవాత మడుగు నాలుగువైపులా ఈదింది.



పెద్ద పిల్లి దారాన్ని లాగి చూసింది.
"ఏం చేస్తున్నావు, చిన్నారి చేపా? పెద్ద చేపని తొందరగా తీసుకునిరా. నాకు బాగా ఆకలిగా ఉంది!" అంటూ అది అరిచింది.
చిన్నారి చేప దారాన్ని పట్టుకుని మడుగు కిందకి వెళ్లింది. "సరే, పెద్ద పిల్లి," చిన్నారి చేప అరిచింది.
"ఇప్పుడు దారాన్ని లాగు!"
పెద్ద పిల్లి దారాన్ని లాగసాగింది. అందుకు దాని బలాన్నంతా ఉపయోగించాల్సి వచ్చింది.



కానీ చివరికి దాని చేతికి తుప్పు పట్టిన ఒక సైకిలు వచ్చింది!
“నన్ను మోసం చేశావు!" అంటూ పెద్ద పిల్లి అరిచింది.
కోపంతో అది ఊగిపోతోంది.
మడుగులో ఈదుతున్న చిన్నారి చేప నవ్వింది.
ఇప్పుడు అది మడుగు మధ్యలో ఉంది.
“ఇది ఒక చేప కథ," చిన్నారి చేప చెప్పింది.
“పెద్ద పిల్లి కోసం అల్లిన చేప కథ!"

